# మూలం: జీవననాదం

నాగభూషణాచార్యులు, ఎన్.వి.ఎస్.

(గత వారం తరువాయి)

"నువ్వు చెప్పింది బాగానే ఉంది గానీ బాబాయ్... ఈ నాడు కులవృత్తికి ఎంత విలువుందో నీకు తెలియంది కాదు గదా! చూస్తా చూస్తా నాలాగా ఈ బండ చాకిరీ పనిలోకి వీళ్లని తొయ్యలేకపోయాను. పెద్దోళ్ళిద్దరూ అట్టట్టా చదివినా, ఈ మూడో వాడు ఎప్పుడు తప్పితే అప్పుడు చదువు మానిపించి నాకు ఆసరాగా ఉంచుదామనుకున్నాను. వీడేమో స్కూలు ఫస్టున పాసయ్యాడు. అంతే కాదు. ఈ వూళ్లో ఎవరన్నా ఎం.ఎ., పాసయినోళ్లున్నారా? వీడు ప్రయివేటుగా చదివి ఫస్టుక్లాసులో పాసయ్యాడు. పూర్వజన్మసుకృతం సరిగా లేదో ఏమో, ఉద్యోగం రాకుండా ఉంది!" నాన్న నీ ముందు ఇతరుల వద్ద నన్ను పొగడడం ఇంత వరకూ వినలేదు. ఇదే వినడం!

"అవునయ్యా, నీ తప్పు లేకుండా నువ్వు సదివించావ్! మరి ఆ యిశ్వాసమేదీ నీ పెద్దకుమారుళ్లకి? ఒక్క ఎర్ర ఏగానీ యిస్తున్నారా?" చౌదరయ్య గొంతులో సానుభూతికాదు, వ్యంగ్యం తొంగి చూసింది.

"వాళ్లు నాకేదో తవ్వి తలకెత్తుతారని చదివించలేదు ప్రెసిడెంటు బాబూ! వాళ్లని పెంచి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత తండ్రిగా నామీదుంది కదా! ఆ బాధ్యత నెరవేర్చాననంతే. అలాగే వీడికి కూడా ఓ మార్గం ఏర్పడిందాకా నాకు తప్పదు. వాళ్లు నాకేదో ఇవ్వాలనీ, చెండాలనీ నేను కోరడం లేదు. ఇంకా పని చేసే చేవ నాకుంది. మంచం మీద తీసుకోకుండా పోతే అంతే చాలు. మాతాత అలాగే పోయాడు. మా నాన్న కూడా అలాగే తనువు చాలించాడు" నిష్కామయోగిలా చెప్పాడు నాన్న.

"నీ కొడుకుల్ని నువ్వు నెత్తికెక్కించుకుంటే మధ్య నాకేందయ్యా పోయేది?" కండువా దులుపుకుంటూ వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు చౌదరయ్య. "ఇంతకీ వచ్చిన పని మర్చేపోయా. మబ్బులు వేస్తున్నాయి. వర్షం పడేట్టుంది. గొడ్ల సావిడెయ్యాల. రేపొద్దున ఓ పాలి రావయ్యా!" ఆజ్ఞాపించినట్టు చెప్పి వెళ్లిపోయాడు చౌదరయ్య.

పని చేసేవాడు పనే చెయ్యాలి. పల్లకీ ఎక్కేవాడు ఎప్పుడూ పల్లకీనే ఎక్కాలి. ఇదే అనాదిగా వస్తోన్న పెత్తందార్ల నీతి. దీనికి విరుద్ధంగా ఎవరన్నా చేస్తే సహించలేరు వీళ్లు. మనుధర్మశాస్త్రం రోజులు చెల్లినా, కామందులే ఇంకా గ్రామాలకి కిరీటం లేని మారాజులు. బడుగువర్గాలు పైకి రావాలని ఊకదంపుడు ఉపన్యాసాలు ఊదేస్తారు. ఇది వాళ్ల వృత్తి. తీరా ప్రవృత్తులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటాయి. ఉద్యోగమిప్పిస్తానని నన్ను తనింటి చుట్టూ వందల సార్లు తిప్పించుకున్నాడు చౌదరయ్య. తిప్పించుకోవడమే తప్ప, పని మాత్రం శూన్యమని గ్రహించి తిరగడం మానుకున్నాను. ఇప్పుడేమో పదివేలు పారెయ్యమంటున్నాడు. ఇందులో ఈయన వాటా ఎంతో? వీళ్లు... దేశాన్ని నడిపించే రాజకీయనాయకులు! కాదు, కాదు, దేశాన్ని సైతం తాకట్టు పెట్టడానికి కూడా వెరవని దగుల్బాజీలు, దళారీలు, బ్రోకర్లు!

"థూ..." కాండ్రించి ఉమ్మేశాను. మళ్లీ నాన్న ఏమన్నా అనుకుంటాడేమోనని, "చిత్రిక పొట్టు నోట్లో పడింది నాన్నా" అన్నాను.

ఇంతలో ఆపద్బాంధవిలా అమ్మ పిలుపు. "కాఫీ అయింది, లోపలికి రండి" అంటూ.

నేను లేచి నిలబడేసరికి, నాన్న "నువ్వు తాగేసి నాకు పట్రా" అన్నాడు. అలాగేనంటూ వెళ్లాను.

లోపలికి వచ్చి కాఫీ కప్పు నోటికి తగిలించానో లేదో, మోహనరావు వచ్చాడు "డబ్బు సంగతి ఏం చేశా"వంటూ.

నేను మౌనంగా కాఫీ పైచేరిన మీగడ తరగను వేలితో తీసెయ్యడంలో నిమగ్నమయ్యాను. ఇంతలో అమ్మ మరో కప్పు తీసుకొచ్చి మోహనరావు కిచ్చింది.

మోహనరావు కప్పు అందుకుని పక్కన పెట్టి "మీ ఫాదర్ని అడగలేదా?" అడిగాడు.

ఏమని అడగను? నాన్న సంగతి నాకు తెలియకనా? ఉన్న ఒక్క చెల్లి పెళ్లి చేసేందుకు అయిదు వేలు అప్పయింది. దాన్ని తీర్చడమే నాన్నకి కష్టంగా ఉంది. అన్నలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారన్నమాటే గానీ, కనీసం ఈ అప్పు తీర్చడంలోనైనా సహాయం చేద్దామన్న ధ్యాసే లేదు. పైగా ముందరి కాళ్లకు బంధాలన్నట్లు తమ జీతం తమకే చాలడం లేదని. ఉప్పుని, పప్పుని ఇక్కణ్నుంచే పట్టుకెడతారు. ఇలాంటి పరిస్థితిలో నాలుగు వేలిమ్మని ఎక్కడడగను? అదే మోహనరావుతో అన్నాను.

"ఆలోచించు. మా ఫాదర్ ఎల్లుండి విజయవాడ వెడుతున్నాడు. ఈ లోగా ఏ సంగతీ తెలియజెప్పు" కాఫీ తాగకుండానే వెళ్లిపోయాడు మోహనరావు.

"ఏమిట్రా, డబ్బంటున్నాడు మోహన్రావు?" ఎప్పుడొచ్చాడో నాన్న, అడిగాడు.

"ఏం లేదు నాన్నా" ఆయనకు చెప్పడం ఇష్టం లేక అన్నాను.

"పర్వాలేదు చెప్పు. డబ్బేమిటి?" రెట్టించాడు నాన్న.

నాన్న బలవంతం వల్ల చెప్పక తప్పలేదు. వారం రోజుల కిందట పత్రికల్లో విజయవాడలోని ఓ ఎయిడెడ్ స్కూల్లో రెండు ఖాళీలు ప్రకటించారు. ఆ స్కూలు కమిటీ సెక్రెటరీ మోహనరావు వాళ్లకి దూరపుచుట్టం అట! వాళ్ల నాన్న వెళ్లి ఖాళీల విషయం వాకబు చేశాట్ట. ఒక్కొక్క పోస్టుకి పదివేల పైన ఇస్తామని వస్తున్నారని, బంధుత్వం గనుక అందులో సగమిమ్మని అన్నాడట సెక్రెటరీ. మోహనరావు తండ్రి నాలుగు వేలకి బేరం సెటిల్ చేసి తనకొడుకుతో పాటు నా సంగతీ చెప్పి, ఒప్పించి వచ్చాడు. అదీ సంగతి!

ఈ విషయం విన్న నాన్న మొహం వివర్ణమైంది. నాన్న బాధ నాకు తెలియంది కాదు గదా! "ఇంతా చదివి లంచమిచ్చి ఉద్యోగం కొనుక్కోవడం నాకిష్టం లేదు నాన్నా. అదే విషయం రేపు మోహనరావుతో చెబుతా నాన్నా!" దృఢంగా అన్నాను.

"మనొక్కళ్లం మడి కట్టుక్కూర్చుంటే సాగుతుందట్రా? సమాజంలో మార్పు రావాలి. అందాకా మనమూ నలుగురితో పాటు నారాయణా అనక తప్పదు!"

నాన్న మాటలు జీవితాన్ని కాచివడబోసిన మాటలు? వాటినంత తేలిగ్గా కొట్టిపారెయ్యలేం. ఆదర్శాలు పట్టి లాగుతున్నా, మరో వైపు సోమరిగా తింటూ తిరగడానికి సిగ్గు పడుతున్నాను. అయినా ఆ ఆశయాలకు తిలోదకాలిచ్చి దిగజారినా, డబ్బెక్కణ్ణుంచి వస్తుంది?

"పోనీ వున్న కాస్త పొలమూ అమ్మేద్దాం!" ఎప్పుడూ అంతగా మాట్లాడని అమ్మ నోట్లోంచి వచ్చిన మాటల్ని నాన్న కూడా సమర్థించాడు.

చప్పున నేను నిలబడ్డాను. "వద్దు నాన్నా! నా స్వార్థం కోసం ఆ ఉన్న ఎకరం నేలనూ అమ్మి వార్ధక్యంలో ఆపాటికూడా మీకు ఆసరా లేకుండా చెయ్యలేను!" గబగబా బయటకు నడిచి లైబ్రరీకేసి దారి తీశాను.

ప్రతి రోజూ గంటల తరబడి లైబ్రరీలో గడిపే నాకు, ఈ రోజు, ఒక్కో నిమిషం ఒక్కో యుగంలా గడిచింది. పేపర్లలోని

వాంటెడ్ కాలమ్స్ పైన కూడా దృష్టి పెట్ట లేకపోయాను. కాసేపు ఆ పత్రికా, ఈ పత్రికా తిరగేసి, ఇంక కూర్చోలేక మళ్లీ ఇంటి దారి పట్టాను. తల వంచుకుని వస్తున్న నాకు ఎవరిదో పిలుపు వినిపించి ఆగిపోయాను.

ఎదురుగా కూలింగ్ కళ్లద్దాల పెద్దమనిషి నవ్వుతూ నిలబడ్డాడు. అతన్ని సమీపించే దాకా అతనెవరైందీ గుర్తుపట్టలేకపోయాను. తీరా చూస్తే అతను... ప్రభాకర్!

ఎంతలో ఎంత మార్పు! ఎప్పుడూ తెల్లని అడ్డపంచె కట్టుకుని, గుండుతో, నడినెత్తిన పిలకతో కాలేజీ వదిలిన దగ్గర్నుంచీ తండ్రితో పాటు వ్రతాలనీ, నోములనీ, పెళ్లిళ్లనీ తిరుగుతూండేవాడు వీడు. తండ్రి పురోహితుడు. వీడు కూడా నాలుగు మంత్రం ముక్కలు నేర్చుకున్నాడు. చదువులో ఎప్పుడూ ఆఖరి మార్కు వీడిదే! అలాంటి వీడు ఇప్పుడు జిల్లా పరిషత్‌లో ఉద్యోగం సంపాదించి తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేస్తున్న ధీరుడు!

"మాకెవడిస్తార్రా ఉద్యోగం? ప్రభుత్వం దృష్టిలో అగ్రకులస్థులం! ఇటు డబ్బూ లేదు, అటు చదువూ లేదు!" నిర్లిప్తంగా అనేవాడు ఎప్పుడూ.

రిజర్వేషన్‌తో పాటు, ఫస్టు క్లాసు పి.జి. వుండి ఇలా వున్నాను నేను.

"బతికించావురా బాబూ! బస్సు దిగకుండానే కనిపించావ్. లేకపోతే ఈ ఎండన బడి అంత దూరం మీ ఇంటికి రావలసి వచ్చేది." బస్సు ప్రయాణంతో పాటు, సూట్ కేస్ మోస్తున్న అలసటతో వగరుస్తూ అన్నాడు ప్రభాకర్.

"ఏమిటంత అర్జంటు?" అడిగాను.

"ఏమిటని నెమ్మదిగా అంటావ్. నా పెళ్లిరా బాబూ! రాబోయే ఆదివారమే. ఇదుగో వెడ్డింగ్ కార్డు!" జేబులో రెడీగా వుంచుకున్న కార్డు తీసి నా పేరు రాసి ఇచ్చాడు.

నేను దాన్ని చూడకుండానే జేబులో పెట్టుకుని, "అది సరే గానీ, నీ పిలకేదిరా?" అడిగాను వాణ్ని పరకాయించి చూసి.

"ఒరి నీ హాస్యం దొంగల్దోలా! ఇంకా మర్చిపోలేదేమిట్రా పిలక సంగతి? నాకు ఉద్యోగం రావడమేమిటి, తిరపతి కొండ మీద పిలకతో సహా గుండు చేయించుకోవడమేమిటి, వెంటనే చేశా. ఆ గుండుతోనే నా పిలక్కి స్వస్తి చెప్పా!" ధీమాగా అన్నాడు ప్రభాకర్.

"అయితే పౌరోహిత్యం సాంతం వదిలేశావా?"

"ఏదో నీ దయ వల్ల...!"

"బాగుంది, ఇందులో నా దయేముంది మధ్య?"

"నీ అంటే నీ ఒక్కడూ అని కాదనుకో, నీలాంటి వారి దయ అన్నమాట!"

"అంటే...?" అర్థం గాక అడిగాను.



"అదేరా.. మీరీనాడు రిటన్ టెస్టును బాయ్‌కాట్ చేసుండకపోతే నా బోటి అత్తెసరు మార్కుల వాళ్లకి ఈ జన్మలో ఉద్యోగాలు ఒచ్చేవంటావా?"

"అయితే గియితే దేనికిరా ఇప్పుడు? నీ కృషి ఫలించి ఉద్యోగం వచ్చింది, అంతే!"

ఈ మాటలు నా నోటినుండైతే వచ్చాయి గానీ, హృదయంలో ఏదో వెలితి అనిపించింది. ప్రభాకరంతో పాటు ముందుకు నడుస్తున్నానన్నమాటే గానీ, నా మనోనేత్రం ముందు ఆ నాటి రాత పరీక్ష దృశ్యమే కదలాడింది.

** ** **

మూడేళ్ల నుండి జిల్లా పరిషత్ ఇంటర్వ్యూలు లేవు. ఇప్పటికైనా ప్రకటించారు గదా' అని ఉత్సాహంతో దరఖాస్తు చేశాం. అయితే ఇంతలో ముఖ్యమంత్రి గారికి డబ్బుని ఆదాచెయ్యాలనే కోరిక పుట్టింది. అదీ ఉపాధ్యాయుల జీతాలలో ఎలా? అన్న ప్రశ్నకు ఆయన బుర్రలో ఓ మెరపు లాంటి పథకం మెరిసింది. ఆ పథకంలో భాగమే కన్సాలిడేటెడ్ ఉద్యోగాలు! బాటా చెప్పుల ధరలా రూ.398ల స్థిరవేతనంతో కొత్తగా ఉపాధ్యాయుల్ని నియమించాలనుకున్నాడాయన. ఆ ఆలోచనకి ప్రతిపక్షాలు గానీ, ఉపాధ్యాయ, తదితర సంఘాలు గానీ విమర్శించినా ఆయన పట్టించుకోదలుచుకోలేదు.

ముఖ్యమంత్రి పథకం రూపు దాల్చక ముందే జిల్లా పరిషత్తు వారు ఉపాధ్యాయ ఖాళీలు ప్రకటించి దరఖాస్తులు స్వీకరించాక, ఆ ఖాళీలు కన్సాలిడేటెడ్‌గా మారాయనీ, ఇష్టమున్నవారు రాత పరీక్షలకు హాజరు కావచ్చునని చెప్పారు. ఏదో ఒక ఉద్యోగమని, ఆ తర్వాత రెగ్యులర్ కావచ్చుననే అవకాశం ఉండటం వల్ల రిటన్ టెస్టుకి అందరం హాజరయ్యాం. అయితే కొందరు రాజకీయ నాయకులు అక్కడికి వచ్చి, ఇది అన్యాయమని, మామూలు ఉద్యోగాలు ప్రకటించి దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు కన్సాలిడేటెడ్ అని చెప్పడం న్యాయసమ్మతం కాదని, ప్రభుత్వ చర్యను ఏ విధంగానైనా అడ్డుకోవాలనీ, అందుకు పరీక్షల్ని బాయ్‌కాట్ చెయ్యడమొక్కటే మార్గమని ఉపన్యాసాలు దంచారు. అందులో ముఖ్యమంత్రి గారి పార్టీకి మిత్రపక్షంగా ఉన్న ఓ నాయకుడు కూడా ఉండటం గమనార్హం. పైగా ఆయన జిల్లా పరిషత్తు చైర్మన్‌కు సన్నిహితమిత్రుడు కూడా.

ఏమైతేనేం, అందరం ఉత్సాహంతో పరీక్షల్ని బహిష్కరించాం. హాలు బయటికొచ్చి అలా నిలబడ్డామో లేదో, హఠాత్తుగా పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీలు ఝళిపించడం మొదలుపెట్టారు. ఏదో విధంగా పరీక్షలు నిర్వహించాలన్న పట్టుదలతో, చైర్మన్ పోలీసు బందోబస్తు మధ్య కొంత సేపటికి తిరిగి పరీక్షలు నిర్వహిస్తున్నామని, వెంటనే హాజరు కమ్మని ప్రకటించారు.

(మిగతా వచ్చే వారం)